కథ

# సుధామయ సోదరీమణులు

-భమిడిపాటి సోమయాజి

"హలో! అంకుల్, నమస్తే" అన్న మాటలు విని ఇంకా ఉదయం ఆరు అవలేదు, ఇంత పొద్దున్నే నమస్కారం పెడుతూన్న ఆడపిల్ల ఎవరా! అని చూసిన మూర్తికి జయ కనిపించింది.

ఈలోపులో "సార్! పెట్రోల్ ఎన్ని లీటర్లు పోయమంటారు!" అని అడిగాడు బంకులోని కుర్రాడు.

"ఓ నలభై కొట్టు!" అంటూ "ఏమిటి జయ! యింత పొద్దున్నే బయల్దేరావ్!" అన్నాడు.

"ఏకవచనం వద్దు, బయల్దేరింది యిద్దరం! కార్లో విజయ కూడా ఉంది"

"ఈ రోజు నాన్న పుట్టిన రోజు! మా నాన్నకి 'దబల్‌కామీఠా' చాలా యిష్టమని మీకు తెలుసుగా! ఈ స్వీట్ ఆయనకిద్దాం అని పుట్టింటికి వెళుతున్నాం" అంది జయ.

"మీ అక్కచెల్లెళ్లే తియ్యని వారు. అసలు మీరే దబల్‌కామీఠా! అందుకే మిమ్మల్ని కవల పిల్లలుగా పుట్టించాడు దేవుడు. పైగా విజయదశమి రోజు పుట్టారు! అందుకే మీ నాన్న మీకు జయ, విజయా అని పేర్లు పెట్టాడు. మిమ్మల్ని చూస్తే చాలు ఆయన దబల్‌కామీఠా తిని ఆనందిస్తూన్న సంతోషం పొందుతాడు. సరే! నేను యాదగిరిగుట్ట వెడుతున్నాను. మీ నాన్నకి నా శుభాకాంక్షలు చెప్పండి"


"థేంక్స్! వస్తాం అంకుల్!" అంటూ కార్లో వెళ్ళిపోయారు జయ, విజయలు.

* * *

కారు స్టార్టు చేసిన మూర్తితో మిసెస్ మూర్తి అంది.

"వీళ్ళిద్దరూ మీ ఫ్రెండ్ సుధాకర్‌గారి పిల్లలు కదండీ ఎంత అందంగా వున్నారండీ! ఎప్పుడో వీళ్ళ చిన్నతనంలో చూసాను"

"అవునే! వీళ్ళకి దేహ సౌందర్యమొకటే కాదు, ఆత్మ సౌందర్యం కూడా వుంది. అసలు యిటువంటి పిల్లలుండడం పూర్వ జన్మ సుకృతమనుకో! వీళ్ళకి తల్లిదండ్రులంటే వల్లమాలిన ప్రేమ. అస్తమానూ వాళ్ళ ఋణం తీర్చుకోలేకపోతున్నామని బాధపడుతూంటారు. పైగా ఒకసారి మన యింటి దగ్గరున్న రెండు సైట్స్‌కొని మీకిచ్చుంటే యిప్పుడు బోల్డు విలువ అంటే, పెద్దపిల్ల 'మాకెందుకు అంకుల్! మా నాన్న ఉమ్మడి కుటుంబం గురించి బోల్డు బాధ్యతలు వహించారు. కష్టపడి మాకు



మంచి సంబంధాలు చేశారు. మాకంతకంటే యింకేం కావాలి చెప్పండి' అంది"

"పుట్టింటి నుంచి ఏం ఆశించని ఆడపిల్లలు పుట్టడం పెద్ద అదృష్టమే నండీ!" అంది మిసెస్ మూర్తి.

"అవును నిజమే! అందులో యీ రోజుల్లో ఆస్తి గురించి కన్న తల్లిదండ్రుల్ని కూడా చంపేస్తున్నారు"

"మీ ఫ్రెండ్ పుట్టిన రోజన్నారు కదా! సాయంకాలం యీ యాదగిరి నరసింహస్వామి ప్రసాదం అందచేద్దాం వాళ్ళకి!" అంది శ్రీమతి మూర్తి.

* * *

గుమ్మంలో వున్న జయతో "స్వయం విష్ణు వచ్చాడని చెప్పు మీ నాన్నకి" అన్నాడు మూర్తి.

"రండి అంకుల్! మీరు స్వయం విష్ణు, ఆంటీ స్వయం లక్ష్మి" అంది జయ.

లోపల్నించి వచ్చిన సుధాకర్ "రండి విష్ణు మూర్తిగారు" అన్నాడు.

"ఇప్పుడు నేను విష్ణు మూర్తిని కాదు స్వయం విష్ణు"

"సర్లే! అభ్యాగతి స్వయం విష్ణు అని తెలుసు క్రిందటిసారి పుట్టిన రోజుకి పిలిచినా రాలేదు. ఈసారి పిలుద్దామని వస్తే 'పిలవకురా' అని పాడతావేమో అని పిలవడానికి రాలేదు"

"పిలవకురా అనే కాదు 'అలుగ కురా' అని కూడా పాడేవాడిని"

"అబ్బో! మిత్రులిద్దరూ చతురులే!" అంది జయ.

సుధాకర్‌గారు వెళ్ళేటప్పుడు "మిమ్మల్నొకసారి వచ్చి కలుస్తాం!" అన్నారు జయ విజయలు.

"చెప్పకుండానే కలవవచ్చు"

★ ★ ★

తర్వాత ఓసారి జయ విజయలు సుధాకర్‌గారిని కలిసి "మీరేమనుకోక పోతే ఓ సహాయం చెయ్యాలి, అంకుల్!" అన్నారు.

"నావల్లయితే అంతకన్నానా!"

"ఏం లేదు అపుత్రస్యగతిర్నాస్తి అంటారు కదా! మా నాన్నగార్ని ఓ మగపిల్లాడ్ని దత్తత తీసుకోడానికి ఒప్పించండి"

"ఓ అదా! యింతకు ముందు ఓసారి చెప్పాను. కాని అతను ఏమంటాడంటే భూమ్మీద గతి లేని వాడికి అన్ని చోట్ల గతులు ఏదో విధంగా భగవంతుడేర్పాటు చేసేవుంటాడు. అయినా కొడుకుల్ని మించిన కూతుళ్ళుండగా నాకేమిటి! ఏ అవసరమొచ్చినా ఆడపిల్లలు కూడా తల్లిదండ్రుల్ని చూడ్డానికే కాబోలు కన్యాదానం చేసినప్పుడు 'నంప్రతితే' అని ముగిస్తారు. 'నంప్రతితేన మమ్' అని చెప్పకపోవడం వలన పెళ్ళి అయిన తర్వాత కూడా ఆడపిల్లలతో సంబంధ బాంధవ్యాలు కొనసాగుతాయి. అవసరమయినప్పుడల్లా వాళ్ళ బాగోగులు తల్లిదండ్రులు చూస్తూనే వుండాలి. 'నమమ' చెప్పకపోవడం వలన కొడుకులు లేని నాలాంటి వాళ్ళకి అత్యంత సౌకర్యం వాళ్ళు కూడా మమ్మల్ని చూస్తారు అన్నాడమ్మ మీ నాన్న. ఇక వాడికి యీ విషయంలో చెప్పినా ఉపయోగం వుండదు"

"సరే అయితే! మనమేమి చెయ్యగలం" అని కాసేపు కూర్చుని సెలవు తీసుకు వెళ్ళిపోయారు జయ విజయలు.


వాళ్ళు వెళ్ళిన తర్వాత మిసెస్ మూర్తికి వాళ్ళు వచ్చిన పని వివరించాడు.

"అయ్యో! చాలా ఆశ్చర్యంగా వుందండి, అందరూ తండ్రి ఏమీ ఇవ్వలేదని బాధపడే రోజుల్లో, ఆ వున్న ఒక్క యిల్లూ, తమకు అక్కర్లేదనుకుని తండ్రిని మగపిల్లాడ్ని దత్తత తీసుకోవడానికి ఒప్పించమనడం చాలా గొప్ప విషయమే"

"పాపం! తండ్రికి ఉత్తరగతులు లేకుండా పోతాయేమోనని యీ పిల్లల దిగులు! అయినా ఆ యిల్లు కూడా వాళ్ళకి వద్దని ఎప్పుడో చెప్పారు. ఆ యిల్లు చదువుకునే బీద పిల్లల వసతి గృహం కింద మార్చాలనీ ఆ మార్పులకయ్యే ఖర్చు తామే భరిస్తామని ఎప్పుడో చెప్పారు వాళ్ళ నాన్నకి"

"ఎంత సంస్కారవంతులండీ, యీ జయ విజయలు! ఇటువంటి ఆడపిల్లల్ని కన్న తల్లిదండ్రులకి మగ పిల్లలు లేకపోయినా ఉత్తర గతులకి ఏ లోటూ వుండదని నా అభిప్రాయం. అసలు వాళ్ళకి జన్మరాహిత్యమయిపోతుంది" అంది శ్రీమతి మూర్తి.

★ ★ ★




తర్వాత కొన్ని రోజులకి జయ విజయల్ని చూసిన మిసెస్ మూర్తి "మీ నాన్నగారు కట్టిన యిల్లు బీద విద్యార్థులకి వసతి గృహంగా ఏర్పాటు చేద్దామనుకొంటున్నారట కదా! యీరోజుల్లో యిళ్ళూ, వాకిళ్ళూ వదిలేసుకుంటారా ఎవరయినా" అంది వాళ్ళతో.

"చేసిన మంచి పనులు వృధాపోవు ఆంటీ! మనకేం వద్దు అనుకోవడంలోనే మోక్షమార్గం వుందిట. దీనికి ఓ చిన్న వుదాహరణ- రమణ మహర్షి ఆశ్రమానికి వెళుతూనే ఓ అమ్మాయి నాకేం వద్దు స్వామీ! మోక్షం యిప్పించమందట! ఆయన నవ్వి వెళ్ళి భోంచేసిరా! అమ్మా! మాట్లాడదాం అన్నారట. అమ్మాయి భోజనానికి వెళ్ళినప్పుడు యీ సంభాషణ విన్న ఓ అమ్మాయి 'ఎందుకు స్వామీ ఆ అమ్మాయి మోక్షం అడిగితే నవ్వారు. ఆ అమ్మాయి చేసిన తప్పేమిటి!' అని అడిగిందట. మహర్షి అన్నారట. 'అసలు తనకేం వద్దంది కదా, అమ్మాయి! అసలేం వద్దనుకోవడమే మోక్షమమ్మా! ఇక నేను ప్రత్యేకంగా యిచ్చేది ఏముంది!' అన్నారట"

"బాగుంది! మంచి మంచి విషయాలు తెలుసుకుని, యీ చిన్న వయస్సులోనే ఆచరిస్తున్నారు! చాలా సంతోషం!" అంది మిసెస్ మూర్తి.

ఈ విషయం తెలుసుకున్న సుధాకర్ కూడా తన కూతుళ్ళ మనస్తత్వానికి పరమానంద పడ్డాడు.

★


కథా నిలయం
శ్రీకాకుళం

## పేరులోనే వుంది!

పేరు మార్చుకుంటే కలిసొస్తుంది అనే సెంటిమెంట్ సినిమా వాళ్ళలో ఎక్కువగా మనకు కనిపిస్తుంది. తాజాగా తన పేరుని పూర్తిగా కాకపోయినా కొంత మార్చుకుంది తమన్నా. న్యూమరాలజిస్టులు చెప్పిన ప్రకారం తన పేరులోని ఇంగ్లీషు అక్షరాల్లో ఎ, ఎన్ అనే వాటిని ఎక్స్‌ట్రాగా చేర్చుకుందిట. అంతే, దాని ఫలితమో మరేంటోగానీ తమిళంలో మంచి ఆఫర్లు వచ్చిపడ్డాయిట. సెంటిమెంటా మజాకా!